
సాక్షి ఒడిశా

శనివారం । 23 । మార్చి । 2024




శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు
నగదు రూ. 3,83,743
బంగారం - 33 గ్రాముల 300 మిల్లీ గ్రాములు
వెండి - 29 గ్రాముల 500 మిల్లీ గ్రాములు
- భువనేశ్వర్/పూరీ



డోలోత్సవ వైభవం
పర్లాకిమిడిలో డోలోత్సవ వైభవం అంబరాన్నంటింది. భక్తులు అంగరంగ వైభవంగా ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు.

- IIలో▸



న్యూస్‌రీల్

బీజేడీకి భర్తృహరి మెహతాబ్ గుడ్‌బై


భర్తృహరి మెహతాబ్

భువనేశ్వర్: కటక్ నియోజకవర్గం లోక్‌సభ సభ్యుడు భర్తృహరి మెహతాబ్ బిజూ జనతా దళ్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ మేరకు పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌కు శుక్రవారం రాజీనామా పత్రం పంపినట్లు తెలిపారు. బిజూ జనతా దళ్ ఆవిర్భావం నుంచి నేటి ఎదుగుదల వరకు ప్రత్యక్ష పాత్రధారిగా కొనసాగానని, అనివార్య పరిస్థితులలో రాజీనామా చేస్తున్నానని రాజీనామా పత్రంలో పేర్కొన్నారు. భర్తృహరి మెహతాబ్ కార్మిక, నైపుణ్యత, జౌళి శాఖ స్టాండింగ్ కమిటీ అధ్యక్షుడుగా, అధికారిక భాష పార్లమెంటరీ కమిటీ డిప్యూటీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. కటక్ లోక్‌సభ నియోజక వర్గం నుంచి ఆరు సార్లు ఎన్నికయ్యారు. భర్తృహరి మెహతాబ్ భారతీయ జనతా పార్టీలో చేరుతున్నట్లు సమాచారం.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి


పద్మనాభ్ పాత్రో మృతదేహం

రాయగడ: విద్యుదాఘాతానికి గురై యువకుడు మృతి చెందిన ఘటన రాయగడ జిల్లాలోని పుటసింగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జల్తార్ గ్రామం వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. జల్తార్ గ్రామానికి చెందిన పద్మనాభ్ పాత్రో(45) జల్దార్ వద్ద ఇటుక బట్టీలో పని చేస్తున్నాడు. శుక్రవారం పనులు ముగించుకుని ఇంటికి తిరిగి వస్తుండగా సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తీగ తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తోటి కార్మికులు పుటాసింగ్ పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుణుపూర్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విదేశీ మద్యం ట్రక్ సీజ్


పట్టుబడిన మద్యం కేసులు

బరంపురం: పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా నుంచి బరంపురం పట్టణంలోకి ట్రక్కు ద్వారా రవాణా అవుతున్న కోటి రూపాయల విలువైన విదేశీ మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఐఐసీ అధికారి కౌసిక్ మజ్జి తెలిపిన వివరాల ప్రకారం..బరంపురం ఎస్పీ సార్వణ్ వివేక్ సమాచరంతో సూనపూర్ మేరిన్ పోలీసులు బొడర్‌లో ట్రక్కును తనిఖీ చేశారు. అందులో భారీగా ఉన్న విదేశీ మద్యం కేసులను గుర్తించి సీజ్ చేశారు. డ్రైవర్, క్లీనర్‌ను అరెస్టు చేశారు.

చిట్‌ఫండ్ పేరిట రూ.2కోట్లు వసూలు

- పరారైన తల్లీకుమారులు
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు


మోసపోయిన బాధితులు

రాయగడ: చిట్‌ఫండ్ పేరిట రెండు కోట్ల రూపాయల కుచ్చుటోపీ పెట్టి పరారైన తల్లి, కొడుకుల ఉదంతం వెలుగులోకి వచ్చింది. వీరి బారినపడి మోసపోయిన బాధితులు శుక్రవారం పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం ...స్థానిక రింగ్ రోడ్డు వద్ద స్వామి వివేకానంద పాఠశాల సమీపంలో నివసిస్తున్న తృప్తి రాణి కర్, ఆమె కుమారుడు ఆదిత్య కర్ కొన్నాళ్లుగా చిట్‌ఫండ్ పేరిట స్థానికుల వద్ద డబ్బులు వసూలు చేశారు. అధిక వడ్డీలను ఇస్తామని మరికొందరిని నమ్మించారు. ఇలా సుమారు రెండు కోట్ల రూపాయలు వసూలు చేశారు. తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని కొందరు బాధితులు తల్లీకుమారులను నిలదీశారు. త్వరలోనే ఇచ్చేస్తామని చెప్పి గురువారం అర్ధరాత్రి ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయారు. శుక్రవారం తల్లీకుమారుల ఇంటికి వెళ్లిన బాధితులు తలుపులు వేసి ఉండటం గమనించి ఇరుగు పొరుగు వారిని అడుగగా ఖాళీ చేసి వెళ్లిపోయినట్లు చెప్పారు. తామంతా మోసపోయామని భావించిన బాధితులు శుక్రవారం సాయంత్రం పోలీస్‌లను ఆశ్రయించారు. మొబైల్‌నంబర్ల ఆధారంగా వారి ఆచూకీని తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

2024 సార్వత్రిక సమరం

ఒంటరి పోరాటం

- బీజేడీతో పొత్తుకు బీజేపీ నో
- సింగిల్‌గానే వస్తామని బీజేపీ అధ్యక్షుడు మన్మోహన్ సామల్ స్పష్టీకరణ
- 21 లోక్‌సభ, 147 అసెంబ్లీ స్థానాల్లో పోటీకి సై..


మన్మోహన్ సామల్

భువనేశ్వర్: బీజేపీ, బీజేడీ కూటమి ఏర్పాటు గురించి చర్చ, సంప్రదింపులు ప్రారంభించిన పక్షం రోజుల తర్వాత రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ ఒంటరిగానే పోటీ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మన్మోహన్ సామల్ స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం సోషల్ మీడియాలో ఒక ప్రకటన విడుదల చేశారు. మొత్తం 21 లోక్‌సభ, 147 అసెంబ్లీ స్థానాలలో బీజేపీ ఒంటరిగానే పోటీ చేస్తుందని తేల్చిచెప్పారు. గత ఐదేళ్లగా మోదీ ప్రభుత్వం చేపట్టిన వివిధ కార్యక్రమాలకు సీఎం నవీన్ పట్నాయక్ మద్దతు ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ.. డబుల్ ఇంజిన్ ప్రభుత్వం లేకుండా ఒడిశా వేగంగా అభివృద్ధి చెందడం లేదని కుండబద్దలుకొట్టారు. ప్రధాని నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలో రాష్ట్రంలో అన్నిస్థానాల్లోనూ పోటీ చేస్తామని పునరుద్ఘాటించారు. 4.5 కోట్ల ఒడియా ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చడమే ఈ నిర్ణయం లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని, అయితే మోదీ ప్రభుత్వం ప్రారంభించిన సంక్షేమ పథకాలు ఒడిశా ప్రజలకు సక్రమంగా అందడం లేదని, అట్టడుగు స్థాయికి చేరడం లేదని పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వం ఉన్న రాష్ట్రాలు వివిధ రంగాలలో గణనీయమైన అభివృద్ధి, పురోగతి సాధించాయని, ఇదే లక్ష్యంతో ఒడిశాలోనూ పోటీ చేస్తామని సామల్ స్పష్టం చేశారు.


మాజీ మంత్రి దామోదర్ రౌత్ కన్నుమూత

- ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి
- నివాళులు అర్పించిన సీఎం నవీన్, ప్రముఖులు


కొరాపుట్: రౌత్ నివాసం వద్ద మీడియాతో మాట్లాడుతున్న రాజ్యసభ ఎంపీ మున్నా ఖాన్


దామోదర్ రౌత్ చిత్రపటానికి పుష్పాంజలి


భువనేశ్వర్: నివాళులు అర్పిస్తున్న సీఎం నవీన్


కొరాపుట్: నివాళులు అర్పిస్తున్న కేసీసీ బ్యాంక్ అధ్యక్షుడు ఈశ్వర్ చంద్ర పాణిగ్రాహి, రమాకాంత్ రౌళో, లలిత్ శెరి

భువనేశ్వర్: ప్రముఖ రాజకీయ నాయకుడు, ఒడిశా మాజీ మంత్రి డాక్టర్ దామోదర్ రౌత్ శుక్రవారం తెల్లవారుజామున స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఆయన వయసు 81 ఏళ్లు. అతని భార్య స్నేహలత 2019లోనే మరణించారు. అతనికి కుమారుడు సంబిత్ రౌత్రాయ్(ఎమ్మెల్యే), కుమార్తె ప్రీతినంద రౌత్రాయ్(భువనేశ్వర్ మునిసిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్, గాయని) ఉన్నారు. మార్చి 18న తీవ్రమైన గుండెపోటుతో తీవ్ర అస్వస్థతకు గురైన రౌత్‌ను బ్రెయిన్ డెడ్‌గా వైద్యులు ప్రకటించారు.

వెటర్నరీ నుంచి రాజకీయాల్లోకి..

రౌత్ రాజకీయ నాయకుడు కావడానికి ముందు వృత్తిరీత్యా వెటర్నరీ డాక్టర్. 70వ దశకంలో బిజూ పట్నాయక్ ప్రభావంతో రాజకీయాల్లోకి వచ్చారు. 7 సార్లు శాసన సభ్యుడిగా ఎన్నికయ్యారు. జగత్‌సింగ్‌పూర్ జిల్లా ఎరసమా నుంచి 5 సార్లు, పారాదీప్ నుంచి 2 సార్లు శాసనసభకు ప్రాతినిధ్యం వహించారు. దామోదర్ 1977 - 2017 మధ్య నీలమణి రౌత్రాయ్, బిజూ పట్నాయక్, నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని ప్రభుత్వాలలో పంచాయతీరాజ్, మహిళా, శిశు అభివృద్ధి, మత్స్య-పశుసంవర్ధక, సంస్కృతి- ప్రణాళిక, సమన్వయం, ఆరోగ్యం-కుటుంబ సంక్షేమం, సమాచార-పౌరసంబంధాలు, ప్రభుత్వ రంగ సంస్థలు, అబ్కారి-వ్యవసాయం వంటి శాఖలను నిర్వహించారు.

1977లో తొలిసారిగా శాసనసభకు..

దామోదర్ రౌత్ 1977లో తొలిసారిగా జనతా పార్టీ టిక్కెట్‌పై ఒడిశా శాసనసభకు ఎన్నికయ్యారు. 1980లో జనతా పార్టీ (సెక్యులర్) టిక్కెట్‌పై ఒడిశా అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 1990 అసెంబ్లీ ఎన్నికల్లో జనతాదళ్ టికెట్‌పై మరోసారి గెలుపొందారు. 1995లో ఓడిపోయిన ఈ సీనియర్ నేత ఆ తర్వాత 2000, 2004, 2009, 2014లో వరుసగా 12, 13, 14, 15వ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించారు. రౌత్ 1977 నుంచి 2019 వరకు ఎరసమా నుంచి 5 సార్లు, పారాదీప్ అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి 2 సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2000 నుంచి 2001 వరకు తుపాను, ఆహార, పర్యావరణం సభా కమిటీ సభ్యునిగా పని చేశారు. 2019లో తన 45 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ జీవితానికి ముగింపు పలుకుతూ రాజకీయాల నుంచి విరమించారు. ఆయన నిష్కల్మష వాగ్ధాటి పలుమార్లు అధికార పక్షాల్ని ఇరకాటంలోకి నెట్టింది. అయితే 2017లో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకు బిజూ జనతా దళ్ నుంచి బహిష్కరించబడిన తరువాత మాజీ కేంద్ర మంత్రి బ్రజకిషోర్ త్రిపాఠితో కలిసి సొంత రాజకీయ పార్టీ బిజూ సమతా క్రాంతి దళ్‌ను స్థాపించారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ టిక్కెట్‌పై బల్లికుద్దా నియోజక వర్గం నుంచి పోటీ చేసి మూడో స్థానంలో నిలిచారు. బీజేపీతో అతని ప్రయాణం కొన్ని నెలల మాత్రమే కొనసాగింది.

ప్రముఖుల సంతాపం..

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో పాటు గవర్నర్ రఘుబర్ దాస్, ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, పలువురు ప్రముఖులు రౌత్ మృతి పట్ల ప్రగాఢ సంతాపం తెలిపారు. దామోదర్ పార్థివ దేహాన్ని యూనిట్ 6 నివాసం, బిజూ జనతా దళ్ రాష్ట్ర కార్యాలయం శంఖ భవన్, జగత్‌సింగ్‌పూర్ జిల్లాలోని ఆయన నియోజకవర్గ ప్రదేశంలో అంతిమ దర్శనం కోసం ఉంచినట్లు కుటుంబ వర్గాలు తెలిపాయి.

☛ కొరాపుట్: రౌత్ మృతి పట్ల నబరంగ్‌పూర్ జిల్లాకు చెందిన రాజ్యసభ ఎంపీ, ఒడియా సినీ హీరో మున్న ఖాన్, కొరాపుట్ సెంట్రల్ కో-ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు ఈశ్వర్ చంద్ర పాణిగ్రాహీ, లక్ష్మీపూర్ మాజీ ఎమ్మెల్యే కైలాష్ కులసిక, కేసీసీ బ్యాంక్ డైరక్టర్ రమాకాంత్ రౌళో, కొరాపుట్ మున్సిపాలిటీ చైర్మన్ లలెటెందు రంజన్ శెఠి తదితరులు సంతాపం తెలియజేశారు.

కటకటాల్లోకి నకిలీ పోలీసు



అరెస్టయిన నకిలీ పోలీసు నవీన్‌దాస్ (ఎరుపు చొక్కా)

మల్కన్‌గిరి: ఇంటెలిజెన్స్ అధికారినని చెబుతూ మోసాలకు పాల్పడుతున్న ఓ నకిలీ పోలీసును శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. మల్కన్‌గిరి జిల్లా ఖోయిర్‌పూట్ సమితి కుడుములగుమ్మ పంచాయతీ పరిధిలో ఔట్‌పోస్టు ప్రాంతానికి చెందిన నవీన్‌దాస్ తాను పోలీసునని, ఉద్యోగాలు కూడా ఇప్పిస్తానని చెబుతూ స్థానికుల వద్ద డబ్బులు వసూలు చేశారు. ఈ క్రమంలో బలిమెల పోలీసు స్టేషన్ పరిధిలోని నీలాద్రీనగర్‌కు చెందిన మలయ్ పండా, అతని భార్య మధుస్మీతా పండా వద్ద రూ.3లక్షల 67వేలు తీసుకున్నాడు. ఖోయిర్‌పూట్ సమితి రసబేడ పంచాయతీ కుపులిగూడలో ధన మచ అనే వ్యక్తి సోదరికి హోంగార్డ్ ఉద్యోగం ఇప్పిస్తాను రూ.లక్ష వసూలు చేశాడు. మధుస్మితా గత నెలా 19న డబ్బులు విషయమై ప్రశ్నించగా మరోసారి అడిగితే భర్తను ఎన్‌కౌంటర్ చేస్తానని నవీన్‌దాస్ బెదిరించాడు. దీంతో ఆమె బలిమెల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ధన మచ్చ కూడా ఈ నెల 20న బలిమెల పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఐఐసీ ధీరెన్ పట్నాయక్ రంగంలోకి దిగి నవీన్‌దాస్‌ను గురువారం రాత్రి అరెస్టు చేశారు. తాను పోలీసునని చెప్పి మోసం చేసినట్లు శుక్రవారం అంగీకరించడంతో కోర్టులో హాజరుపరిచారు.

కీచక లెక్చరర్ అరెస్టు

మల్కన్‌గిరి: కలిమెల సమితి ఎం.వి.79 గ్రామ పరిధిలోని జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ ఫస్టియర్ చదువుతున్న గిరిజన విద్యార్థినిపై లెక్చరర్ ప్రశాంత్‌కుమార్ పాడీ లైంగికదాడికి పాల్పడ్డాడు. ఎక్కువ మార్కులతో పాస్ చేయిస్తానని నమ్మబలికి తనపై లైంగికదాడికి పాల్పడినట్లు బాధితురాలు శుక్రవారం జిల్లా విద్యశాఖాధికారి విశ్వనాథ్ సాహుకు, ఎస్పీ నితీష్ వాద్వానీకి ఫిర్యాదు చేసింది. ఎస్పీ ఆదేశాల మేరకు మల్కన్‌గిరి నుంచి ప్రత్యేక బృందం వెళ్లి కళాశాలలో విచారణ చేపట్టి నిందితుడు ప్రశాంత్‌కుమార్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. శనివారం కోర్టులో హాజరుపరుస్తామని ఎస్పీ తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం


మాట్లాడుతూ ఎస్‌డీపీఓ అజిత్‌కుమార్ వర్మ

జయపురం: సబ్ డివిజన్‌లో శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తానని జయపురం సబ్ డివిజనల్ పోలీసు అధికారిగా బాధ్యతలు చేపట్టిన అజిత్‌కుమార్ వర్మ అన్నారు. జయపురం ఎస్‌డీపీఓ కార్యాలయంలో శుక్రవారం తొలిసారిగా విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటుసారా తయారీకి అడ్డుకట్ట వేస్తానని చెప్పారు. ట్రాఫిక్ సమస్యను చక్కదిద్దుతానని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కలప, గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామన్నారు. పోలీసులు చేపట్టే కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని కోరారు. పట్టణంలో ముఖ్య కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు.

మీకు తెలుసా..?



సీఎంగా ఉంటూనే ఎంపీ ఓటు

- అవిశ్వాస తీర్మానం సందర్భంగా ఓటు వినియోగించుకున్న గిరిధర్
- ఆ ఒక్క ఓటుతోనే కూలిపోయిన వాజ్‌పేయి ప్రభుత్వం
- ఇద్దరు సీఎంలను అందించిన అవిభక్త కొరాపుట్ జిల్లా


గిరిధర్ గమాంగ్


సదాశివ త్రిపాఠి

కొరాపుట్: రాష్ట్రస్థాయిలో ప్రతి రాజకీయ నాయకుడికి అంతిమ లక్ష్యం ముఖ్యమంత్రి పదవి. ఎంతో మందికి అందని ద్రాక్ష. అటువంటి సీఎం పదవి అవిభక్త కొరాపుట్ జిల్లాలకు చెందిన ఇద్దరు నాయకులను వరించడం విశేషం. నబరంగ్‌పూర్ జిల్లాకు చెందిన సదాశివ త్రిపాఠి, రాయగడ జిల్లాకి చెందిన గిరిధర్ గమాంగ్‌లు అనూహ్య రీతిలో ముఖ్యమంత్రి పీఠాలు అధిరోహించారు.

విధేయతకు పట్టం..

రాయగడ జిల్లా గుణుపూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన గిరిధర్ గమాంగ్ సైతం సీఎం అయ్యారు. 1999 ఫిబ్రవరి 15 నుంచి అదే ఏడాది డిసెంబర్ 6 వరకు పదవిలో కొనసాగారు. గాంధీ కుటుంబానికి వీర విధేయునిగా ఉండటం గిరిధర్‌కు ప్రధాన అర్హత అయింది. అప్పటికే 8వ సారి గిరిధర్ గమాంగ్ ఎంపీగా కొనసాగుతున్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అంతర్గత కలహాలతో కొట్టుమిట్టాడుతోంది. కేంద్రంలో విపక్షంలో కాంగ్రెస్ ఉండగా.. అధికారంలో ప్రధానిగా వాజ్‌పేయ్ ఉన్నారు. ఈ సమయంలో ఒడిశాపై దృష్టి సారించే సమయం కాంగ్రెస్‌కు లేకపోయింది. దాంతో నమ్మకస్తుడుగా ముద్ర ఉన్న కొరాపుట్ ఎంపీ గిరిధర్‌ని ముఖ్యమంత్రిగా చేశారు. ఈ పరిణామం దేశ చరిత్రని మారుస్తుందని ఎవ్వరూ ఊహించలేదు. కేంద్రంలో వాజ్‌పేయ్ ప్రధానిగా ఉన్నప్పుడు ఒక్క ఓటు తేడాతో ప్రభుత్వం కూలిపోవడానికి గిరిధర్ కారణం అయ్యారు. ఒడిశా సీఎం అయినప్పటికీ గిరిధర్ ఎంపీ పదవికి రాజీనామా చేయలేదు. అవిశ్వాస తీర్మానంలో ఓటు వేయాలని కాంగ్రెస్ ఎంపీలకు విప్ జారీ చేసింది. సీఎంగా ఉన్న గిరిధర్ ఎంపీ హోదాలో ఓటు వేయడానికి పార్లమెంట్‌కి వెళ్లారు. గిరిధర్ ఓటు వేయడానికి రావడం పట్ల దేశ వ్యాప్తంగా వ్యతిరేకత వ్యక్తమైంది. అయినప్పటికీ అధిష్టానం పట్ల వీరవిధేయునిగా ఉన్నందున చివరి ఓటు వేసి కేంద్రంలో వాజ్‌పేయ్ ప్రభుత్వం కూలిపోవడానికి పరోక్ష కారణమయ్యారు. అదే గిరిధర్ కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరి అక్కడ ఇమడ లేక తిరిగి కాంగ్రెస్ గూటికి చేరడం గమనార్హం.

కలిసివచ్చిన కలహాలు..

1965 అక్టోబర్ 2 నుంచి 1967 మార్చి 8 వరకు నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే సదాశివ త్రిపాఠి ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ పార్టీ తరఫున కొనసాగారు. నాడు కేంద్రంలో కాంగ్రెస్‌లోని వర్గ విభేదాలు సదాశివకి కలిసి వచ్చాయి. అప్పట్లో కాంగ్రెస్‌లో ఉన్న మాజీ ముఖ్యమంత్రి బిజూ పట్నాయక్ పూర్తి సహాయ సహకారాలతో సదాశివ సీఎం అయ్యారని నబరంగ్‌పూర్ జిల్లా వాసులు ఇప్పటికీ గుర్తు చేసుకుంటారు. సదాశివ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనడంతో పాటు అవినీతికి దూరంగా ఉండేవారు. నవీన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత భువనేశ్వర్ లో సదాశివ విగ్రహం ప్రతిష్ఠించారు. అతని జయంతిని రాష్ట్ర ప్రభుత్వం నేటికీ అధికారికంగా రాజధానిలో నిర్వహిస్తుంది. సదాశివ వంశీయులు నబరంగ్‌పూర్‌లో మధ్య తరగతి జీవితాలు గడుపుతుండటం అతని నిస్వార్థ జీవితానికి నిదర్శనంగా పేర్కొంటారు.

లోక్‌సభలో తెలుగు తేజాలు


రాచకొండ జగన్నాథ రావు

జయపురం: ఒడిశా రాష్ట్రం కొరాపుట్ జిల్లాలోని రెండు లోక్‌సభ స్థానాల్లో మొదటి సారి లోక్‌సభకు ఎన్నికైన వారు తెలుగు వారే కావడం విశేషం. 1951లోజరిగిన మొదటి లోక్‌సభ ఎన్నికలో జయపురం మిల్లువీధికి చెందిన పొన్నాడ సుబ్బారావు నవరంగపూర్ స్థానం నుంచి గణతంత్ర పరిషత్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. అదే విధంగా, రాయగడ-ఫుల్‌బాణి నియోజకవర్గంలో కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన తోయిక సంగన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1957లో జరిగిన రెండో లోక్‌సభ ఎన్నికల నాటికి నవరంగపూర్ నియోజకవర్గాన్ని కొరాపుట్‌లో విలీనం చేశారు. కొరాపుట్ లోక్‌సభను ఇద్దరు సభ్యులతో ఏర్పాటు చేశారు. ఆ ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థులు రాచకొండ జగన్నాథరావు, టి.సంగన్నలు గణతంత్ర పరిషత్ అభ్యర్థులుగా నిలబడి పీహెచ్.రుస్తుమ్‌జీ, శ్యామఘన ఉల్కలను ఓడించారు. 1962 సాధారణ ఎన్నకల నాటికి కొరాపుట్ నియోజకవర్గాన్ని మళ్లీ విడదీసి కొరాపుట్ (ఎస్‌టి), నవరంగపూర్ జనరల్‌గా మార్చారు. అందులో కాంగ్రెస్ అభ్యర్థిగా రాచకొండ జగన్నాథరావు నిలబడి గణతంత్ర పరిషత్ అభ్యర్థి ఎన్.రామశేషయ్యను ఓడించి విజయం సాధించారు. రాచకొండ జగన్నాథరావు మొత్తమ్మీద తన జీవిత కాలంలో రెండుసార్లు అవిభక్త కొరాపుట్ నుంచి, ఐదుసార్లు గంజాం జిల్లా నుంచి వరుసగా ఏడు సార్లు ఓటమి లేకుండా విజయం సాధించి తెలుగువారి సత్తాచాటారు. పార్లమెంటు జీవితంలో వర్క్స్, హౌసింగ్, సివిల్ సప్లయ్, లేబర్, ఎంప్లాయ్‌మెంట్, రిహాబిలిటేషన్, పార్లమెంటరీ అఫైర్స్, కమ్యూనికేషన్స్, పెట్రోలియం, కెమికల్, మైనింగ్ తదితర మంత్రి పదవులు అధిరోహించారు.

నిష్పక్షపాతంగా పనిచేయండి



మాట్లాడుతున్న బరంపురం ఎస్పీ సార్వణ్ వివేక్

బరంపురం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శాంతియుత పోలింగ్ జరిగేలా పోలీసులు నిష్పక్షపాతంగా పనిచేయాలని బరంపురం ఎస్పీ డాక్టర్ సార్వణ్ వివేక్ సూచించారు. గురువారం రాత్రి దక్షిణాంచల్ ఐజీ కార్యలయ సమావేశ మందిరంలో ఎస్పీ అధ్యక్షతన ఏఎస్పీ, డీఎస్పీ, ఐఐసీ పోలీసు అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు పోలీసు బలగాలను మోహరించాలని సూచించారు. ఎన్నికల కోడ్ అతిక్రమించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

గంజాంలో గంజాయి కలకలం

- రూ.కోటి విలువైన గంజాయి సీజ్
- ఏడుగురు అరెస్టు
- ట్రక్కు, కారు స్వాధీనం


అరెస్టయిన నిందితులతో ఎక్సైజ్ అధికారులు


సీజ్ చేసిన గంజాయి

బరంపురం: గంజాం జిల్లాలో గంజాయి మాఫియా వీరవిహారం చేస్తోంది. పోలీసుల తనిఖీల్లో సుమారు కోటి రూపాయల విలువైన గంజాయి పట్టుబడింది. బరంపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామచంద్ర మిశ్రా తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం నగర సమీపంలోని 16వ నంబర్ జాతీయ రహదారిలో అరటి పండ్ల లోడుతో వెళ్తున్న ట్రక్కు, షిఫ్ట్ కారులో అక్రమంగా గంజాయి రవాణా అవుతోందన్న సమాచారం మేరకు బరంపురం అబ్కారీ విభాగం అధికారులు తనిఖీలు చేపట్టారు. లోపల కోటి రూపాయలకి పైగా విలువైన గంజాయిని స్వాధీనం చేసుకుని ఏడుగురిని అరెస్టు చేశారు. రజిల్లా కలెక్టర్ దివ్యజ్యోతి పరిడా ఇచ్చిన సమాచారంతో బరంపురం నగరం మీదుగా ఆంధ్రప్రదేశ్ వైపు వెళ్తుండగా హల్దియాపధర్ జాతీయ రహదారిలో ఈ వాహనాలను పట్టుకున్నట్లు ఎక్సైజ్ అధికారి రమేంద్ర నారాయణ నాయక్ తెలిపారు. అరెస్టయిన వారిలో రాయగడ జిల్లాకు చెందిన ప్రణబ్‌కుమార్ బెహరా, కొంధమాల్ జిల్లా పిరింగియా గ్రామానికి చెందిన ఆశ్విన్‌కుమార్ సాహు, ఖుర్దా జిల్లాకి చెందిన బాసుదేవ్ పరిడా, గంజాం జిల్లాకు చెందిన పంకజ్ రౌవుళా, అనిల్ మహరణ, రాయగడా జిల్లాకు చెందిన మరో ఇద్దరు ఉన్నట్లు వివరించారు.

క్లుప్తంగా

మెరుగ్గా కమల పూజారి ఆరోగ్యం

జయపురం: ఇటీవల తీవ్ర అస్వస్థతకు గురై కటక్ మెడికల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పద్మశ్రీ కమల పూజారి పూర్తిగా కోలుకున్నారు. ఆరోగ్యం మెరుగవ్వడంతో గురువారం సాయంత్రం స్వగ్రామంలోని పాత్రోపుట్‌లోని తన నివాసానికి వెళ్లిపోయారు. రామణగుడ హాస్పిటల్ సిబ్బంది, జిల్లా కేంద్ర హాస్పిటల్ సిబ్బంది కమల పూజారి ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షిస్తారని అధికార వర్గాలు తెలిపాయి.

'సీసీఎస్ హామీలు అమలు చేయాలి'

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగులకు సీసీఎస్(క్రెడిట్ కో–ఆపరేటివ్ సొసైటీ) యాజమాన్యం ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య డిమాండ్ చేశారు. శ్రీకాకుళంలో రాష్ట్రస్థాయి సీసీఎస్ డెలిగేట్ల సమావేశం సందర్భంగా ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయంలో శుక్రవారం ఈయూ సీసీఎస్ డెలిగేట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌ఎంయూ కూటమి ఆర్టీసీ ఉద్యోగులకు ఎన్నో హామీలిచ్చి అమలు చేయలేదని గుర్తు చేశారు. సొసైటీ ఎన్నికల్లో గెలిచిన వెంటనే లోను పెట్టిన 24 గంటల్లో ఇప్పిస్తామన్న హామీ ఏమైందని అడిగారు. అదేవిధంగా అన్ని జిల్లాల్లో కో–ఆపరేటివ్ స్టోర్స్ పెట్టి తక్కువ ధరకే సరకులు పంపిణీ చేస్తామన్నారని, ఆ విషయం కూడా మరచిపోయారన్నారు. ఈయూ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పి.భానుమూర్తి మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న సీసీఎస్ యాజమాన్య కమిటీ డెలిగేట్లతో చర్చించకుండా ఏకపక్షంగా నిర్ణయాలు చేస్తూ ఉద్యోగులకు నష్టం కలిగిస్తున్నారన్నారు. అనంతరం ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావును మర్యాదపూర్వకంగా కలుసుకుని సత్కరించారు.

యువకుడిపై పోక్సో కేసు

టెక్కలి రూరల్: స్థానిక సర్వమంగళ వీధికి చెందిన సనపల కుమా ర స్వామి అనే యువకుడిపై ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం టెక్కలి సీఐ పి.పైడయ్య పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. సర్వమంగళ వీధికి చెందిన కుమారస్వామి తన కుమార్తెను ప్రలోభపెట్టి, ఎవరూ లేని సమయం చూసి ఇంటిలోకి వచ్చి బీరువా తాళాలు తీసుకుని రెండు బంగారు హారాలు దొంగిలించా దని బాధితురాలు ఫిర్యాదులో పే ర్కొన్నారు. దీంతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రముఖ వైద్యుడు రాజేంద్ర నాయుడు కన్నుమూత

శ్రీకాకుళం: జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ శ్రీరామినేని రాజేంద్రనాయుడు(90) శుక్రవారం వేకువజామున మృతి చెందారు. 1969లో చిత్తూరు జిల్లా నుంచి శ్రీకాకుళం వచ్చి ప్రభుత్వ వైద్యునిగా చేరిన ఈయన ఐదేళ్ల తర్వాత ఉద్యోగానికి రాజీనామా చేశారు. శ్రీకాకుళంలోనే వైద్య సేవలందిస్తూ మన్ననలు పొందారు. ఈయన మరణించే ఐదు రోజుల ముందు వరకు వైద్య సేవలందిస్తూనే ఉన్నారు. రాజేంద్రనాయుడు అంత్యక్రియలు శుక్రవారం పూర్త య్యాయి. డాక్టర్ మృతిపై రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పైడిశెట్టి జయంతి, ల్యాబ్ టెక్నీషియన్సు అసోసియేషన్ అధ్యక్షుడు పూడిపెద్ది రవీంద్రనాథ్ సంతాపం తెలిపారు.

ఆదిత్యుని సన్నిధిలో సాంఘిక సంక్షేమ శాఖ రాష్ట్ర సెక్రటరీ



ఆదిత్యుని జ్ఞాపికను హర్షవర్ధన్‌కు అందజేస్తున్న శంకరశర్మ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ సెక్రటరీ కె.హర్షవర్ధన్ శుక్రవారం ఉదయం దర్శించుకున్నారు. వీరికి ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, అధికార సిబ్బంది ప్రత్యేకంగా స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం వేదాశీర్వచనాన్ని అందజేసి, ఆలయ విశిష్టతను వివరించారు.కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారులు, ఆలయ సిబ్బంది బిఎస్.చక్రవర్తి పాల్గొన్నారు. శ్రీకూర్మం కూర్మనాథుడిని కూడా ఆయన దర్శించుకున్నారు.

కానిస్టేబుల్ సురేష్ కుటుంబానికి చెక్ అందజేత

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలోని బూర్జ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ.. ఇటీవలే రోడ్డు ప్రమాదంలో మరణించిన కె.సురేష్ కుటుంబానికి అడిషనల్ కార్పస్ ఫండ్ రూ.లక్ష నగదు చెక్కును ఎస్పీ జీఆర్ రాధిక అందజేశారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చిన కానిస్టేబుల్ సురేష్ భార్య శిరీషకు ఎస్పీ తన ఛాంబరులో ఈ చెక్కు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సురేష్ మర ణం చాలా బాధాకరమని, ధైర్యంగా ఉండాలని, జిల్లా పోలీసు శాఖ మీ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. మిగిలిన ప్రయోజనాలు త్వరితగతిన వచ్చేటట్లు చర్యలు తీసుకోవాలని కార్యాలయ సిబ్బందిని ఎస్పీ ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్పీతో పాటు ఏఓ సీహెచ్ గోపినాథ్ ఉన్నారు.



రాధాగోవింద ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువస్తున్న భక్తులు

డోలోత్సవ వైభవం

పర్లాకిమిడిలోని డోలాట్యాంకు రోడ్డులో గురువారం సాయంత్రం నుంచి డోలా ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. రాత్రి 8.30 గంటల సమయంలో రామస్వామి మందిరం నుంచి రాధాగోవింద ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొచ్చారు. పెద్ద ఎత్తున భక్తులు రంగులు జల్లుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. హోలీ వరకు డోలోత్సవాలు వైభవంగా జరుగుతాయని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రాజగురు తెలిపారు.

– పర్లాకిమిడి



రాధా గోవింద విగ్రహాలు



ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

కార్మికులకు కనీస పెన్షన్ రూ.9వేలు ఇవ్వాలి

జయపురం: విశ్రాంత కార్మికులకు కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలని జయపురం శ్రామికుల ఐక్య కార్యాచరణ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం జయపురం లేబర్ విభాగ అధికారి బృందావన శెట్టికి వినతిపత్రం అందజేశారు. విశ్రాంత కార్మికులకు, మృతి చెందిన విశ్రాంత కార్మికుల కుటుంబాలకు బకాయి ఉన్న పీఎఫ్, గ్రాట్యుటీలు వెంటనే చెల్లించాలని కోరారు. సేవా పేపరుమిల్లులో నాలుగు కార్మిక యూనియన్ ప్రతినిధులను, మిల్లు యాజమాన్యాన్ని సమావేశ పరిచి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో కార్మికనేత ప్రమోద్ కుమార్ మహంతి, జుధిష్టర్ రౌళో, ఉమాకాంత రథ్, ప్రదీప్ పంజియ, వైజయంతి పండా, అమ్మన సాహు తదితరులు పాల్గొన్నారు.



లేబర్ అధికారికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

న్యాయవాదులకు శిక్షణ

జయపురం: న్యాయ సేవా ప్రదీకరణ సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ సంస్థ ఆధ్వర్యంలో న్యాయవాదులకు శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి, న్యాయ సేవా ప్రదీకరణ అధ్యక్షుడు సత్యనారాయణ మిశ్రా, ప్రధాన విభాగ విచారపతి శాంతన కుమార్‌దాస్, శాశ్వత లోక్ అదాలత్ విచారపతి సుమన్ జెనా ప్రసంగిస్తూ మెలకువలు వివరించారు. కార్యక్రమంలో ఉప ప్రతిపక్ష న్యాయవాది కె.దివాకరరావు, హరిశ్చంద్ర ముదులి, ప్రభుత్వ న్యాయవాది గీతాంజలి ధల్ పాల్గొన్నారు.



శిక్షణా శిబిరంలో జిల్లా జడ్జి సత్యనారాయణ మిశ్రా

చోరీ కేసులో వ్యక్తి అరెస్టు

జయపురం: నవరంగపూర్ రోడ్డులోని సిమెంట్, ఇనుప సామగ్రి దుకాణంలో ఈ నెల 15న జరిగిన దోపిడీ కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు బొయిపరిగుడ పోలీసు సబ్ డివిజన్ పోలీసు అధికారి తపస్వినీ కొహర్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నవరంగపూర్ పట్టణంలోని లొహరసాహి ప్రాంతానికి చెందిన హుసేన్ హరిజన్ సిమెంట్ షాపులో చొరబడి మొబైల్ ఫోన్, రూ. రెండు వేల నగదు పట్టుకుపోయాడు. షాపు యజమాని దీపక సింహ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు హుషేన్ హరిజన్‌ను నిందితుడిగా గుర్తించి అరెస్టు చేశారు. ఈ దోపిడీలో మరో ఇద్దరు దుండగులు ఉన్నట్లు గుర్తించామని, వారిని కూడా త్వరలోనే అరెస్టు చేస్తామని కొహర్ తెలిపారు. సమావేశంలో బొరిగుమ్మ పోలీసు అధికారి జుగల్ కిశోర్ షా, కేసు దర్యాప్తు అధికారి ఎ.ఎస్.ఐ సుభాష్ చంద్ర షొడంగి పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న పోలీసు అధికారి

పట్టుదలతో చదివితే ఉజ్వల భవిత



మాట్లాడుతున్న సచితానంద మహంతి, కళాశాల ప్రతినిధులు

బరంపురం: విద్యార్థులు పట్టుదలతో చదివితే ఉజ్వల భవిష్యత్తు సొంతమవుతుందని వక్తలు పేర్కొన్నారు. గురువారం రాత్రి అందపసర రోడ్డులోని రాయల్ కాలేజీ ఆఫ్ ఫార్మసీ అండ్ హెల్త్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో రాయల్ ఫార్మసి వైబ్రేషన్–2024 వార్షిక ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భువనేశ్వర్‌కు చెందిన డాక్టర్ సచితానంద మహంతి, డైరెక్టర్ ప్రొఫెసర్ పి.ఎస్.మూర్తి, చైర్మన్ టి.ప్రకాశరావు, ప్రిన్సిపాల్ ఎస్.కె.పండా హాజరై జ్యోతిప్రజ్వలన చేశారు. విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.



హాజరైన విద్యార్థులు

ఉగాది ఉత్సవాల్లో మహిళా సంఘాలు

- ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నెక్కంటి



మాట్లాడుతున్న నెక్కంటి భాస్కరరావు. చిత్రంలో చంద్రమౌళి తదితరులు

రాయగడ: ఉగాది ఉత్సవాల్లో మహిళా సంఘాలు కూడా సహకారాన్ని అందించాలని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు అన్నారు. గురువారం సాయంత్రం తెలుగు మహిళా సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 11 ఏళ్లుగా ఉగాది వేడుకలను కలిసికట్టుగా నిర్వహిస్తున్నామని, ఈసారి ఉత్సవాల్లో మహిళా సంఘాలను కూడా భాగస్వామ్యం చేస్తున్నామని చెప్పారు. ఐదు రోజుల పాటు వేడుకలు జరిగేలా సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. గత ఏడాది ఉగాది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ముగ్గుల పోటీలు, మెహందీ పోటీలకు విశేష స్పందన లభించిందని గుర్తు చేశారు. ఉత్సవ కమిటీ సలహాదారుడు నెక్కంటి కృష్ణచైతన్య మాట్లాడుతూ ఏప్రిల్ 9, 10వ తేదీల్లో ఉగాది ఉత్సవాలు ప్రారంభమవుతాయని వివరించారు. అంతకుముందుగా నిర్వహించే వివిధ పోటీల్లో స్థానిక మహిళా సంఘాల వారు సహకరిస్తే అందుకు అనుగుణంగా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. సాయిప్రియ మహిళా వాకర్స్ క్లబ్ ఉపాధ్యక్షురాలు పొట్టాం రమాదేవి మాట్లాడుతూ ఈసారి ఉత్సవాల్లో పోటీలు వినూత్నంగా ఉండాలన్నారు. స్థానిక కళాకారులకు అవకాశం కల్పించాలని సూచించారు. సమావేశంలో జిల్లా ఉగాది ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షులు చంద్రమౌళి కుముంధాన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న మహిళా సంఘాల ప్రతినిధులు

కన్నులపండువగా కామదహనోత్సవం

గార: ప్రఖ్యాత వైష్ణవ క్షేత్రం శ్రీకూర్మంలో శుక్రవారం సాయంత్రం నుంచి డోలోత్సవాలు ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరాగా స్వామి తిరువీధి, అనంతరం కామదహనంతో తొలిరోజు ఉత్సవం కన్నుల పండువగా జరిగింది. ఫాల్గుణ శుద్ధ చతుర్దశి నాడు మఘ నక్షత్రంలో జరిపే ఈ కామదహనం తిలకించిన భక్తులకు మోక్ష ప్రాప్తి కలుగుతుందని స్థలపురాణం. ఈ దహనంలో ఏర్పడిన యజ్ఞ భస్మాన్ని తీసుకొనేందుకు భక్తులు పోటెత్తారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ జి. గురునాథం, ఏఎంసీ చైర్మన్ బరాటం నాగేశ్వరరావు, సర్పంచ్ గోరు అనిత, వైస్ ఎంపీపీ అందవరపు బాలకృష్ణమూర్తి, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

శ్రీముఖలింగంలో..

జలుమూరు: డోలోత్సవాల్లో భాగంగా శ్రీముఖలింగేశ్వరునికి శనివారం కామదహనోత్సవం ఘనంగా జరిగింది. పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి పల్లకిలో దక్షిణ ముఖంగా మంగళ వాయిద్యాలు నడుమ మధ్య ఊరేగించారు. మహిళలు,భక్తులు స్వామివారికి హారతులు ఇవ్వగా అనంతరం కామదహనోత్సవం నిర్వహించారు.



శ్రీముఖలింగంలో కామదహోనత్సవం

ఆదిత్యాలయం ముందు..

- గుండెపోటుతో విశ్రాంత ఉపాధ్యాయుడి మృతి

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి దర్శనానికి వచ్చిన నరసన్నపేటకు చెందిన రిటైర్డ్ టీచర్ ఉదండరావు వెంకట భాస్కరరావు (70) అకస్మాత్తుగా గుండెపోటుతో ఆలయ ఆవరణలోనే మృతి చెందారు. భార్య కృష్ణవేణితో కలిసి శుక్రవారం ఉదయం ఆదిత్యుని దర్శనానికి వచ్చిన భాస్కరరావు.. సెక్యూరిటీ పాయింట్ రోడ్డు వద్దనే ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. దీంతో ఆలయ సెక్యూరిటీ, అధికార సిబ్బంది అప్రమత్తమై 108 వాహనానికి కాల్ చేశారు. అయితే వారు వచ్చి ఆయన మృతి చెందినట్లు తెలిపారు. అనుకోని ఈ సంఘటనతో నిశ్చేష్టురాలైన భార్య ఆయన మృతదేహం వద్ద రోదించిన తీరు కంటతడి పెట్టించింది. శుద్ధి కార్యక్రమాలు నిర్వహించాక సర్వ దర్శనాలకు అనుమతించారు. భాస్కరరావు మృతితో స్వస్థలం నరసన్నపేటలోని మారుతీనగర్‌లో విషాద ఛాయలు అలముకున్నాయి.



కుప్పకూలిపోయిన భాస్కరరావు వద్ద విలపిస్తున్న భార్య కృష్ణవేణి

• ముమ్మరంగా రబీ వరి కోతలు



జొన్నవలస వద్ద యంత్రాల ద్వారా వరికోతలు చేస్తున్న రైతులు

ఆమదాలవలస రూరల్: మండలంలోని జొన్నవలస, మునగవలస, రామచంద్రాపురం తదితర గ్రామాల్లో రబీ వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. సాగునీటి కాలువల ద్వారా సకాలంలో నీరు విడుదల కావ డంతో ఈ ఏడాది వరి పంటలు బాగా దిగుబడులు వస్తున్నాయని రైతులు చెబుతున్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా సబ్సిడీపై ఎరువులు అందించడంతో రబీ సీజన్‌లో వరి పంటలను సాగు చేయడానికి ఆస్కారం కలిగిందని అంటున్నారు. ప్రస్తు తం వరి పంట యంత్రాల ద్వారా కోతలు చేసి నూర్పిడిలు జరుపుతున్నారు.

నీలమణి దుర్గ హుండీ ఆదాయం రూ.3.45 లక్షలు



నీలమణి దుర్గ ఆలయంలో హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

పాతపట్నం: ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవం నీలమణి దుర్గ అమ్మవారి హుండీ కానుకల ద్వారా రూ.3,45,512 ఆదాయం లభించిందని ఆలయ ఆలయ చైర్మన్ నూలు ఈశ్వరరావు, ఈఓ టి.వాసుదేవరావులు తెలిపారు. 29 రోజులకు ఈ ఆదాయం వచ్చిందన్నారు. ఆలయ హుండీ ఆదాయాన్ని శుక్రవారం ఉదయం లెక్కించామని, శ్రీ ఉమారుద్రకోటేశ్వర స్వామి దేవస్థానం ఆలయ కార్యనిర్వహ ణాధికారి ఎం.సుకన్య పర్యవేక్షించారన్నారు. బంగారం 30 గ్రాములు, 200 మిల్లీగ్రాము లు, వెండి 2 కేజీల 50 గ్రాములు లభించిందన్నారు. లెక్కింపులో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.3లక్షల విలువైన గంజాయితో బీహారీలు అరెస్టు

కాశీబుగ్గ: పలాస రైల్వేస్టేషన్ వద్ద జీఆర్పీ పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో 60 కిలోల గంజాయితో ఇద్ద రు బీహార్ వాసులు పట్టుబడ్డారని జీఆర్పీ సీఐ కె.వెంకటరావు, ఎస్ఐ షరీఫ్ తెలిపారు. జీఆర్పీ హెచ్‌సీ కోదండరావు, పీసీ ఎం.సంతోష్‌కుమార్, బి.దేవేంద్రనాథ్, పి.రమేష్‌బాబు, శ్రీనివాసరావు, తేజ, సిబ్బందితో కలిసి పలాస రైల్వే స్టేషన్ ప్లాట్ ఫారంలో ముమ్మర తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా బీహార్ రాష్ట్రానికి చెందిన ఎండీ శ్యామ్‌సార్, ఎండి సామిన్ అనే ఇద్దరు వ్యక్తులు గుణపూర్ నుంచి పలాస రైల్వే స్టేషన్ వచ్చి సికింద్రాబాద్ వెళ్లడానికి ప్రయత్నిస్తుండగా జీఆర్పీ పోలీసులు గమనించి వారిని అదుపులోకి తీసుకున్నారు. వీరిద్దరి వద్ద నుంచి రూ.3 లక్షల విలువగల 60 కిలోల గంజాయిను సీజ్‌ను చేసి అనంతరం ఇరువురిని రిమాండ్ చేసి జైలుకు తరలించారు.



గంజాయితో దొరికిన నిందితులను చూపుతున్న పలాస జీఆర్పీ పోలీసులు

'విద్యార్థులు లక్ష్యంతో చదవాలి'

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేఆర్ రజిని అన్నారు. వర్సిటీలోని మహాత్మా జ్యోతిరావు పూలే న్యాయ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వీసీ మాట్లాడుతూ న్యాయ విద్య పూర్తయిన తర్వాత సమాజానికి సేవ చేసే అవకాశం లభిస్తుందన్నారు. న్యాయవాదిగా, న్యాయ శాఖ అధికారిగా, సమాజంలో గుర్తింపు లభించే ఇతర వృత్తుల్లో సైతం రాణించవచ్చునని అన్నారు. కార్యక్రమంలో రెక్టార్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ పి.సుజాత, కోర్సు కోఆర్డినేటర్ వై.రాజేంద్రప్రసాద్, న్యాయ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్లు జేకే ఎల్.సుజాత, జి.జయలక్ష్మి, టొంకాల బాలకృష్ణ, చిన్నారావు, మన్మధరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు వినతి



ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

విజయనగరం: రోడ్లు, తాగునీరు సదుపాయం కల్పించమని కోరుతూ ఎస్టీ కమిషన్ చైర్మన్ డా.డీవీజీ శంకరరావుకు శ్రీకాకుళం జిల్లాకు చెందిన గిరిజన నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు శ్రీకాకుళం జిల్లాలోని ఆదివాసీ గిరిజన చైతన్య వేదిక ఆధ్వర్యంలో గిరిజన నాయకులు విజయనగరంలో గల ఎస్టీ కమిషన్ క్యాంప్ కార్యాలయంలో కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావును శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలాస మండలం తర్లకోట పంచాయతీ గిరిజన గ్రామాలతో పాటు మెళియాపుట్టి మండలం విల్లుపురం పంచాయతీ గిరిజన గ్రామాల్లో సమస్యలు పరిష్కరించి..మౌలిక సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వేదిక సభ్యులు వరహాల కృష్ణారావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

చెరుకుతోటలు దగ్ధం



ప్రమాదంలో దగ్ధమైన చెరకు పంట

బాడంగి: మండలంలోని పి.వెంకయ్యపేట గ్రామంలో జరిగిన అగ్నిప్రమాదంలో ఆరుగురు రైతులకు చెందిన సుమారు 4 ఎకరాల్లోని మమ్ము చెరకు పంట శుక్రవారం కాలిపోయింది. ఈ మేరకు బాధిత రైతులు పూడిశంకరరావు, గంగరాజు, మరడాన లక్ష్మణ, అల్లుసత్యనారాయణ, గంటసత్యనారాయణ, మూడడ్ల అప్పలనాయుడులు మాట్లాడుతూ అగ్నిప్రమాదం ఎలా జరిగిందో స్పష్టంగా తెలియనప్పటికీ ఆస్తినష్టం సుమారుగా రూ.లక్షన్నర వరకు ఉంటుందని వాపోయారు. చెరకు క్రషింగ్ చేసి బెల్లంతయారీ చేసుకునేందుకు తయారవుతున్న తరుణంలో కటింగ్ చేస్తుండగా ప్రమాదం జరిగినట్లు రైతుల తరపున గ్రామసర్పంచ్ ప్రతినిధి మూడడ్ల శంకరరావు చెప్పారు. ప్రమాద సమాచారం మేరకు డొంకినవలస నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు.

రెండు బైక్‌లు ఢీకొని ఒకరికి గాయాలు



గాయాలపాలైన వాసు

సీతానగరం: రాష్ట్రరహదారిలో చినభోగిలి-సీతానగరం గ్రామాల మధ్య శుక్రవారం రెండు బైక్‌లు ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో ఒకరు గాయాల పాలయ్యారు. ఈ ప్రమాదంపై సీతానగరం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సీతానగరం మండలంలోని చినభోగిలి గ్రామానికి చెందిన చుక్క వాసు మోటార్ సైకిల్‌పై పార్వతీపురం వస్తున్నాడు. అదే సమయంలో ఎదురుగా పార్వతీపురం నుంచి బొబ్బిలి వెళ్తున్న మరో ద్విచక్రవాహన చోదకుడు వాసు బైక్‌ను ఢీ కొట్టడంతో రోడ్డుపై పడిపోగా తలకు బలమైన గాయాలయ్యాయి. క్షతగాత్రుడు వాసును కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. బాధితుడి తల్లి జానకమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.రాజేష్ తెలియజేశారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై కేసులు

విజయనగరం అర్బన్: ఎన్నికల కమిషన్ సూచనల మేరకు ఎన్నికల నియమావళి ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదుచేస్తున్నట్టు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. జిల్లాలో శుక్రవారం వరకు 12 ఉల్లంఘన కేసులను నమోదు చేసినట్టు ఆమె చెప్పారు. వీటిలో ఎస్.కోట నియోజకవర్గంలో 3, రాజాంలో రెండు, నెల్లిమర్లలో 2, చీపురుపల్లి, బొబ్బిలిలో ఒక్కొక్కటి, విజయనగరం నియోజకవర్గంలో 3 కేసులను పోలీస్‌లు నమోదు చేశారన్నారు.

25 నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

డెంకాడ: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయం వద్ద ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు శ్రీదేవి, భూదేవి సహిత శ్రీనివాసుని వార్షిక బ్రహ్మోత్సలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త, కమిటీ సభ్యులు తెలిపారు. డెంకాడ, గుణుపూరు గ్రామాల సరిహద్దులో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 26న కల్యాణ వేంకటేశ్వరస్వామి తిరుకల్యాణ మహోత్సవం, 27న సుదర్శన హోమం, పండిత సదస్యం, 28న చక్రస్నానం, తదితర కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

టీడీపీ నేత చెత్తపని..!

- లక్కిడాంలో పారిశుద్ధ్య సమస్య
- సొంత స్థలంలో 2017-18లో సంపద తయారీ కేంద్రం నిర్మాణం
- పంచాయతీకి అప్పగించని వైనం
- రూ.3.63 లక్షల ప్రజాధనం దుర్వినియోగం
- చెత్తను రోడ్డుపైనే వేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది



రోడ్డుపై పేరుకుపోయిన చెత్తాచెదారం



టీడీపీ నాయకుడి సొంత స్థలంలో నిర్మించిన ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రం

గంట్యాడ: అధికార బలంతో ఆ టీడీపీ నేత రెచ్చిపోయాడు. నిబంధనలను తుంగలో తొక్కి.. ఓ 'చెత్త' పనికి పూనుకున్నాడు. అప్పటి అధికారులు కూడా ఆయనకు వంతపాడారు. ఫలితం.. లక్షల రూపాయల ప్రజాధనం దుర్వినియోగమైంది. ప్రజలకు 'చెత్త'కష్టాలు వీడడంలేదు. టీడీపీ హయాంలో లక్కిడాం గ్రామంలో నిర్మించిన సంపదతయారీ కేంద్రం దీనికి నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తోంది.

నిబంధనలకు విరుద్ధంగా...

లక్కిడాం గ్రామానికి చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రం 2017-18లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైంది. రూ.3.63లక్షల ఉపాధి హామీ నిధులతో దీనిని నిర్మించారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. ప్రభుత్వ స్థలంలో నిర్మించాల్సిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని టీడీపీలో అప్పట్లో కీలక పదవిలో ఉన్న ఓ నేత తన సొంత స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించారు. తర్వాత కేంద్రాన్ని పంచాయతీకి అప్పగించ లేదు. పలుమార్లు పంచాయతీకి అప్పగించాలని పంచాయతీ అధికారులు కోరినా.. నా ఇష్టం... ఏం చేసుకుంటారో చేసుకోండి అంటూ సదరు నేత సమాధానం చెప్పడం గమనార్హం. సొంత స్థలంలో సంపద తయారీ కేంద్రం నిర్మాణానికి అనుమతులు ఎలా మంజూరు చేశారన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని సొంత స్థలంలో నిర్మించడం వల్లే అతని నుంచి కేంద్రాన్ని స్వాధీనం చేసుకోలేకపోతున్నామని పంచాయతీ అధికారులు వాపోతున్నారు. స్థలం లేక లక్కిడాంలో సేకరించిన చెత్తను రోడ్డుపైనే పారిశుద్ధ్య సిబ్బంది డంప్ చేస్తున్నారు. దీంతో దుర్వాసన భరించలేకపోతున్నామని స్థానికులు వాపోతున్నారు. వ్యర్థాల వల్ల వచ్చే గాలిని పీల్చడం వల్ల ఎటువంటి వ్యాధులు ప్రబలుతాయోనని వాపోతున్నారు.

అప్పగించ లేదు

2017-18 కాలంలో ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని నిర్మించారు. అప్పటి నుంచి ఆ కేంద్రాన్ని పంచాయతీకి అప్పగించలేదు. ప్రజాధనంతో సొంత స్థలంలో నిర్మించడం తప్పు. అప్పుడు ఎలా అనుమతులు ఇచ్చారో తెలియడం లేదు. ఇప్పుడు ఆ కేంద్రాన్ని అప్పగించేందుకు ఆయన ససేమిరా అంటున్నారు. దీనిపై పూర్తిస్థాయిలో వివరాలు తెలుసుకుంటాను.

– సుందరరావు, ఏపీఓ, ఉపాధిహామీ పథకం

తు.చ తప్పకుండా

- ఎన్నికల నియమావళి పాటించాల్సిందే
- కలెక్టర్ నిషాంత్ కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్

సాక్షి, పార్వతీపురం మన్యం: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రతి ఒక్కరూ కచ్చితంగా అమలు చేయాల్సిందేనని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిషాంత్ కుమార్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఎన్నికల నోడల్ అధికారులతో శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై ఎన్నికల కమిషన్ ఆదేశాలను వెల్లడించారు. ప్రవర్తనా నియమావళి అమలుకు ముందు పంపిణీ చేసిన లబ్ధిదారుల కార్డులు, నిర్మాణ శిలా ఫలకాలు తదితర అంశాలలో ఉన్న ఫొటోలకు సంబంధించి ఎటువంటి జోక్యం అవసరం లేదు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు సమయంలో ఏర్పాటు చేసిన నిర్మాణ శిలాఫలకాలు, లబ్ధిదారులకు పంపిణీ చేసిన కార్డులు మొదలైన వాటిలో ముఖ్యమంత్రులు, ఇతర రాజకీయ నాయకుల ఫొటోలు, సందేశాలు ఉండరాదని పేర్కొన్నారు.

పోలీసు అధికారుల అనుమతి తప్పనిసరి

ప్రతిపాదిత సమావేశాల వేదిక, సమయం గురించి సకాలంలో స్థానిక పోలీసు అధికారులకు తెలియజేయాలి. అవసరమైన అన్ని అనుమతులు తీసుకోవాలి.

- ప్రతిపాదిత సమావేశం జరిగే ప్రదేశంలో నిర్బంధ, నిషేధ ఉత్తర్వులు అమలులో ఉంటే, వాటిని గౌరవించాలి. మినహాయింపులు అవసరమైతే తప్పనిసరిగా దరఖాస్తు చేసి అనుమతులు సకాలంలో పొందాలి.
- ప్రతిపాదిత సమావేశాల కోసం లౌడ్‌స్పీకర్లు, ఇతర సౌకర్యాల వినియోగానికి తప్పనిసరిగా అనుమతి పొందాలి.
- ఊరేగింపు ప్రయాణంలో ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఉండాలి.

ఆంక్షలు పాటించాల్సిందే..

ప్రచార సమయంలోను, పోలింగ్ రోజున వాహనాల రాకపోకలపై ఆంక్షలు పూర్తిగా పాటించాలి.

- ఓటర్లు, అభ్యర్థులు, వారి ఎన్నికల/పోలింగ్ ఏజెంట్లు మినహా ఎన్నికల సంఘం నుంచి నిర్దిష్ట చెల్లుబాటయ్యే అధికార లేఖ ఉన్న వ్యక్తులు మాత్రమే ఏదైనా పోలింగ్ బూత్‌లోకి ప్రవేశించాలి.
- నియోజకవర్గం నుంచి ఓటరు, అభ్యర్థి లేదా అభ్యర్థి ఎన్నికల ఏజెంట్ మినహా ఇతరులు ప్రచార వ్యవధి ముగిసిన తర్వాత నియోజకవర్గాన్ని విడిచి వెళ్లాలి.
- ఓటరుకు ఎలాంటి ప్రేరేపణ, ఆర్థిక లేదా ఇతరత్రా బహుమతులు అందించరాదు.
- ఓటర్ల కుల, వర్గ భావాలను ఎన్నికల ప్రచారంలో ప్రస్తావించరాదు.
- దేవాలయాలు, మసీదులు, చర్చిలు, గురుద్వారాలు లేదా ఏదైనా ప్రార్థనా స్థలాన్ని ప్రచారానికి ఉపయోగించరాదు.
- ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం, బెదిరించడం నేరం.
- పోలింగ్ స్టేషన్‌కు 100 మీటర్ల పరిధిలో ప్రచారం చేయడం, 48 గంటల వ్యవధిలో బహిరంగ సభలు నిర్వహించడం అనైతికం.
- ఓటర్లను పోలింగ్ స్టేషన్‌కు, బయటకు తరలించడం నిషేధం.
- ఉదయం 6 గంటలకు ముందు..రాత్రి 10గంటల తర్వాత ప్రచారం బంద్
- స్టాటిక్ లేదా కదిలే వాహనాలపై అమర్చిన లౌడ్ స్పీకర్లను ఉదయం 6 గంటలకు ముందు..రాత్రి 10 గంటల తర్వాత ఉపయోగించరాదు.
- సంబంధిత అధికారుల ముందస్తు రాతపూర్వక అనుమతి లేకుండా బహిరంగ సభలు, ఊరేగింపులలో లౌడ్ స్పీకర్లను ఉపయోగించరాదు. సమావేశాలు, ఊరేగింపులు రాత్రి 10 గంటల తర్వాత కొనసాగించడానికి అనుమతి లేదు.
- ఎన్నికల సమయంలో మద్యం పంపిణీ చేయరాదు.

క్రీడాకారులకు అభినందనలు

- జాతీయ ఫెన్సింగ్ పోటీల్లో రాణించాలి
- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: జాతీయ స్థాయిలో జరగనున్న సబ్ జూనియర్ ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున ప్రాతినిధ్యం వహించే క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ పాటవాలతో రాణించి, పతకాలు సాధించాలని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆకాంక్షించారు. ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు రాజమండ్రిలో జరగనున్న జాతీయ ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైన విజయనగరం క్రీడాకారులు బి.సాయి చైతన్య, పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన కోట హర్షిత, కె.హితలు శుక్రవారం కోలగట్లను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల విజయనగరం వేదికగా జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించడం ఆనందంగా ఉందని కోలగట్ల అన్నారు. కార్యక్రమంలో విజయనగరం జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ చీఫ్ కచ్ డి.వి.చారిప్రసాద్, కోచ్‌లు అనిల్ కుమార్‌శర్మ, ఎం.సతీష్‌కుమార్, పి.అప్పలరాజు పాల్గొన్నారు.

చైన్ దొంగల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు (వెనుక ముసుగులో నిందితులు)

విజయనగరం క్రైమ్: ఓ వృద్ధురాలి మెడలో బంగారు చైన్ దొంగిలించిన ఇద్దరు నిందితులను చోరీ చేసిన చైన్, రెండు సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని తోటపాలానికి చెందిన బంక గురుమూర్తమ్మ ఎయిమ్స్ స్కూల్ వెనుక భాగంలో గురువారం పశువులను మేపుతుండగా అక్కడికి వచ్చిన అపరిచిత వ్యక్తి యోగక్షేమాలు అడుగుతున్నట్లు నటించి, చుట్టుపక్కల ఎవరూ లేరని నిర్ధారించుకుని వృద్ధురాలి మెడలో బంగారు చైన్ లాక్కున్నాడు. తర్వాత కొద్దిదూరంలో ఉన్న మరో వ్యక్తి మోటార్ సైకిల్‌పై ఉండగా ఇద్దరూ కలిసి పరారయ్యారు. ఈ మేరకు బాధితురాలు వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టిన ఎస్సై జె.తారకేశ్వరరావు, సిబ్బంది సంఘటనా స్థలాన్ని సందర్శించి ఆధారాలు సేకరించారు. నేరానికి పాల్పడిన నిందితులను పూసపాటిరేగలోని చాకలివీధికి చెందిన మామిడి సత్యకుమార్, గురాన భార్గవ్‌లుగా గుర్తించి అరెస్టు చేసి, వారి నుంచి బంగారు చైన్, నిందితులు ఉపయోగించిన రెండు మొబైల్స్ స్వాధీనం చేసుకున్నారు.

ముందే కూసిన కోయిల..!

- బొబ్బిలి టీడీపీ అభ్యర్థిపై కేసు నమోదు

బొబ్బిలి: ఎన్నికల కమిషన్ గత నిబంధనలను సవరించిందని తెలియదో లేక దూసుకువెళ్లిపోదాం అనుకున్నారో గానీ బొబ్బిలి టీడీపీ అభ్యర్థి ఆర్ వీఎస్‌కేకే రంగారావు(బేబినాయన) అనుమతులు తీసుకోకుండా ప్రచారం ప్రారంభించి ఇంటింటికీ తిరిగేశారు. గత ఎన్నికల సమయంలో తన సోదరుడు ప్రారంభించినట్లుగానే ఆయన కూడా సంతతోట నుంచి (రాజానగర్ కాలనీ) ప్రచారాన్ని ప్రారంభించేశారు..కానీ అనుమతులు ఉండాలన్న ఆలోచన చేయలేదు. దీంతో కోడ్ ఆఫ్ కాండక్ట్ టీమ్ చూసి స్పందించింది. అనుమతులు ఉన్నాయా? లేవా? అని ఆరా తీసిన క్రమంలో అనుమతులు లేవని తేలడంతో ఎస్సై జి.లోవరాజు బేబినాయన ప్రచార యావను గుర్తించి కేసు నమోదు చేశారు. బేబీ నాయనపై కేసట అని పట్టణంలోని అన్ని ప్రాంతాలతో పాటు నియోజకవర్గంలోనూ ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ విషయమై సీఐ ఎం.నాగేశ్వర రావును వివరణ కోరగా నిబంధనలు ఉల్లంఘించిన మాట వాస్తవమేనని, అదుకే నిబంధనల అతిక్రమణపై బేబినాయనపై కేసు నమోదు చేశారని ఎస్సై జి.లోవరాజు తెలిపారు.

పుచ్చకాయల వ్యాన్ బోల్తా



గోతిలో పడిన వ్యాన్

బాడంగి: మండలంలోని డొంకినవలస ఎత్తు కానా వద్ద అదుపుతప్పి వ్యాన్ బోల్తాపడడంతో పుచ్చకాయలు నుజ్జయిపోయి నేలపాలయ్యాయి. గురువారం రాత్రి సంభవించిన ప్రమాదానికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా రావులపాలానికి చెందిన వ్యాపారి ఎ.గంగారావు కురుపాంలో రైతులనుంచి 10 టన్నుల పుచ్చకాయలు కొనుగోలు చేశారు. అనంతరం విజయవాడకు చెందిన వ్యాన్ బుక్‌చేసుకుని సుమారు లక్ష రూపాయల సరుకు రావులపాలానికి తరలిస్తుండగా ప్రమాదం జరిగింది. కురుపాం మండల కేంద్రం నుంచి లోడుతో వెళ్తున్న వ్యాన్‌లో ఆయిల్ అయిపోవడంతో ఎత్తైన ప్రాంతం ఎక్కలేక బ్రేక్ విఫలమై రోడ్డుకు అడ్డంగా తిరిగి కొత్తగా కడుతున్న వేబ్రిడ్జి పక్క గోతిలో పడిపోయిందని వ్యాపారి బంధువు చెప్పారు.

నివేదికలు పక్కాగా ఉండాలి

విజయనగరం అర్బన్: కంట్రోల్ రూమ్ నుంచి పంపే నివేదికలు పక్కాగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి సిబ్బందికి సూచించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఎన్నికల కంట్రోల్ రూమ్‌లోని అన్ని విభాగాలను శుక్రవారం తనిఖీ చేశారు. మీడియా మోనటరింగ్, సోషల్ మీడియా, 24/7 కాల్ సెంటర్, ఎంసీసీ విభాగం, రిపోర్టింగ్ విభాగాలను తనిఖీచేసి అక్కడి సిబ్బందితో మాట్లాడారు. విధులపై ఆరా తీశారు. కాల్ సెంటర్ 08922-797120, 08922-797124కు ఫోన్‌చేసి, ఓటర్లు తమపేరు ఓటర్ల జాబితాలో ఉందోలేదో తెలుసుకోవచ్చన్నారు. కలెక్టర్ వెంట జేసీ కార్తీక్, సీపీఓ బాలాజీ, జెడ్పీ సీఈఓ రాజ్‌కుమార్, జీఎస్‌డబ్ల్యూఎస్ కో-ఆర్డినేటర్ నిర్మలాదేవి, ఎంసీసీ నోడల్ అధికారి అరుణశ్రీ, డీపీఆర్ఓ రమేష్ పాల్గొన్నారు.

సమయపాలనే విజయానికి సోపానం



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న క్యాప్‌జెమినీ వైస్ ప్రెసిడెంట్ వసంత

రాజాం సిటీ:

సమయపాలనే విజయానికి సోపానమని, విద్యార్థులు చక్కని నాయకత్వ లక్షణాలు పెంపొందించుకుని ఉన్నత స్థానాలు అధిరోహించాలని బెంగుళూరుకు చెందిన క్యాప్ జెమినీ వైస్ ప్రెసిడెంట్ వసంత సూచించారు. స్థానిక జీఎంఆర్ ఐటీ 26వ వార్షికోత్సవానికి ఆమె శుక్రవారం హాజరయ్యారు. విద్యార్థులు మంచి మూర్తిమత్వంతో ప్రపంచాన్ని జయించగలరని పేర్కొన్నారు. విద్యతోపాటు మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. తను కూడా ఇదే కళాశాల విద్యార్థినని, ఇక్కడ నేర్చుకున్న అంశాలను నిత్య జీవితంలో ఉపయోగిస్తున్నానని గుర్తుచేశారు. బెంగుళూరుకు చెందిన కాగ్నిజెంట్ క్యాంపస్ రిక్రూట్‌మెంట్ హెడ్ అశ్వత్ వేణుగోపాల్ మాట్లాడుతూ 2047 నాటికి భారత్ గొప్ప ఆర్థిక శక్తిగా ఎదగడానికి మనమంతా కృషిచేయాల్సిన అవశ్యకత ఉందని విద్యార్థులకు సూచించారు. ప్రస్తుతం సాంకేతికతతో పాటు కృత్రిమ మేథస్సు అందుబాటులోకి వచ్చిందని, ఆ రంగంలో అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. ప్రతిభ విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో జీఎంఆర్ వీఎఫ్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ గిరీష్, ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్ఎస్‌వీ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మూగబోయిన ఆదివాసీ కళాకారుడి గొంతు

- విషాదంలో గిరిజనులు



కుమారుడి మృతదేహం వద్ద విలపిస్తున్న తండ్రి శతాధిక వృద్ధుడు బాలిమ్మ గొమాంగో (ఇన్‌సెట్లో) మృతుడు రైకన్న(ఫైల్)



భామిని: ఆదివాసీ గిరిజనుల మాతృభాష అయిన సవరభాషలో భక్తి గీతాలు రాసి పాడి సంగీతం జోడించి మైమరిపించే ఆదివాసీ కళాకారుడు నల్లరాయిగూడకు చెందిన బిడ్డిక రైకన్న (52) కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. దీంతో ఆయన సంగీతాభిమానులైన ఆదివాసీలు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. విశాఖలో మృతిచెందిన రైకన్నకు భామిని మండలంలోని నల్లరాయిగూడలో వందలాది మంది ఆదివాసీ గిరిజనుల రోదనల మధ్య శుక్రవారం అంతిమ సంస్కారాలు నిర్వహించారు. 16 మంది సంతానంలో చివరి కుమారుడు రైకన్న మృతిని జీర్ణించుకోలేక తండ్రి శాతాధిక వృద్ధుడు బాలిమ్మ గొమాంగో కన్నీరుమున్నీరు కావడాన్ని చూపరులు జీర్ణించుకోలేకపోయారు. ఏడాది క్రితం ఇంటిలో పెంచిన కుక్క కరవడంతో రేబిస్ వ్యాధికి రైకన్న గురయ్యాడంటూ బోరున విలపిస్తూ కుటుంబసభ్యులు తెలిపారు. గిరిజన యువతకు ఉచితంగా సంగీతం నేర్పించేవాడని గుర్తు చేసుకుంటున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, 8 మంది సోదరులు, ఏడుగురు సోదరీమణులున్నారు. మృతుడి సోదరులందరూ ప్రభుత్వ ఉద్యోగులు కావడం విశేషం.

హోరాహోరీగా ఉత్తరాంధ్ర వాలీబాల్ పోటీలు



హోరాహోరీగా తలపడుతున్న వాలీబాల్ క్రీడాకారులు

తెర్లాం: ఉత్తరాంధ్ర స్థాయి వాలీబాల్ పోటీలు తెర్లాం మండలంలోని విజయరాంపురం గ్రామంలో రెండు రోజులుగా హోరాహోరీగా సాగుతున్నాయి. గ్రామంలో నిర్మించిన శ్రీలక్ష్మీ గణపతి ఆలయం ప్రతిష్ఠ సందర్భంగా ఉత్తరాంధ్ర స్థాయి వాలీబాల్ పోటీలను ఆలయ కమిటీ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ పోటీల్లో పలు గ్రామాలకు చెందిన 38 జట్లు పాల్గొన్నాయి. పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. పోటీల్లో మొదటి మూడు స్థానాలు సాధించిన విజేత జట్లకు వరుసగా రూ.20వేలు, 15వేలు, 10వేలు చొప్పున నగదు బహుమతి అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడి నియామకం

- బర్రి చిన్నప్పన్నకు నియామక పత్రం అందజేత



బర్రి చిన్నప్పన్నకు నియామక పత్రాన్ని అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

విజయనగరం ఫోర్ట్: వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జిల్లాకు చెందిన బర్రి చిన్నప్పన్న నియమితులయ్యారు. ఈ మేరకు ఉమ్మడి విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి శుక్రవారం నియామక పత్రాన్ని ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా బర్రి చిన్నప్పన్న మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. బీసీలకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చింది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీయేనన్నారు. బీసీల సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని గుర్తు చేశారు.

ప్రతి నీటిబొట్టూ విలువైనదే



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.రమేష్

పార్వతీపురం టౌన్: ప్రతి నీటి బొట్టూ ఎంతో విలువైనదని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.రమేష్ అన్నారు. ఈ మేరకు ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా శుక్రవారం పార్వతీపురం పట్టణంలోని జిల్లా కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని నీటి ప్రాముఖ్యం గురించి తెలిపారు. సృష్టిలో ప్రతి జీవికి నీటి అవసరం ఎంతో ఉందని, నీటిని వృథా చేయకుండా, అవసరం మేరకు ఉపయోగించుకోవాలని సూచించారు. పరిశుభ్రమైన నీటిని మరగబెట్టి చల్లార్చిన తరువాత మాత్రమే తాగాలని హితవు పలికారు. వర్షాకాలంలో నీటిని పొదుపు చేసుకునేందుకు ఇంటిముందు ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవాలన్నారు. సామాజిక, ఆర్థిక వృద్ధి ఎక్కువగా నీటిపైనే ఆధారపడి ఉంటుందని, తాగునీరు మానవ ఆరోగ్యానికి, శ్రేయస్సుకు చాలా అవసరమని వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ జడ్జి, ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ డి.సౌజన్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు, టి.జోగారావు, లోక్ అదాలత్ మెంబర్ జి.వెంకటరావు, అడిషనల్ పీపీ ఎం.వెంకటరమణ, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా సహస్ర దీపాలంకరణ



దీపాల కాంతుల శోభలో స్వామికి ఊంజల్ సేవ జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని సీతారామస్వామి దేవస్థానంలో శుక్రవారం సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ మేరకు వెండి మంటపంలో ఉన్న సీతా రామస్వామిని పల్లకిలో ఊరేగించి దీపారాధన వేదిక వద్దకు తీసుకువచ్చి ప్రత్యేక ఊయలలో ఆసీనులను చేశారు. అనంతరం సహస్ర దీపాలను వెలిగించి, స్వామికి ఊంజల్ సేవ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.